www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 7 అక్టోబర్ 2025

ఘనంగా వడ్డే ఓబన్న179వ వర్ధంతి

ప్రజాశక్తి-మదనపల్లె

తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ముద్దు బిడ్డ వడ్డే ఓబన్న 179వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెల్లా వెంకటయ్య మాట్లాడుతూ వడ్డెర జాతి కీర్తి, ఐక్యతను సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధ్యక్షులు దేరంగుల పద్మనాభరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, వడ్డెర్లకు కంకర, గ్రానైట్ క్వారీలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్. మహాదేవ, సామిరెడ్డి, రెడ్డిశేఖర్, చంద్రశేఖర్, డి.రాజా, తమ్మిశెట్టి చంద్ర, పల్లపు రమేష్, మేకల రెడ్డిశేఖర్, చెల్లా నర్సింహులు, దేవరింటి శ్రీనివాసులు, డేరింగుల గుణ పాల్గొన్నారు.

ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

13న అంగన్వాడీల మహాధర్నా

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

4 నెలలుగా అంగన్వాడీలకు సెంటర్ అద్దెలు, 5 నెలలు కూరగాయల బిల్లులు, 2 నెలలుగా వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈనల 13న రాయచోటి ప్రాజెక్టు కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు తెలిపారు. సోమవారం ఆయన రాయచోటి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, సిడిపిఒ శశికళల ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలపై సమావేశం నిర్వహించారని చెప్పారు. ఆ సమావేశంలో ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వకపోవడం వలనే బిల్లుల చెల్లింపులో జాప్యం అవుతోందని, తన చేతిలో ఏమి లేదని సిడిపిఒ చెప్పారని పేర్కొన్నారు. నాలుగు నెలలుగా పస్తులున్న అంగన్వాడీలు సోమవారం ప్రభుత్వంతో ఆకలి పోరాటానికి సిద్ధమయ్యారని తెలిపారు. అర్బన్‌లో ప్రతి కార్మికురాలికి రూ.60 వేలు, రూరల్‌లో రూ.50 వేల జీతం ప్రభుత్వం చెల్లించక పోవడంతో వారు అర్ధాకలితో తీవ్ర మనో వేదనతో జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం నాలుగు నెలలుగా బడ్జెట్ కేటాయించకపోతే సెంటర్ నిర్వహణ ఏ విధంగా నడపాలని ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి తెలిపారు. జీతంతో పాటు బిల్లులు నిలిచిపోవడంతో సెంటర్ల నిర్వహణ ఇబ్బందిగా మారిందని వాపోయారు. పెరిగిన ధరలకు కనీస వేతనాలు పెంచకపోగా చెల్లించాల్సిన బిల్లులు ఇస్తే చాలనే పరిస్థితికి అంగన్వాడీలను చులకనగా చూసిన గత వైసిపి ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. బియ్యం, కందిపప్పు, ఆయిల్ ల సరఫరా విషయంపై రేషన్ డీలర్లు, అధికారులు ఒకరిపై నొకరు సాకులు చెబుతూ ఆరు రోజులుగా సెంటర్లకు స్టాక్ చేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరాలో జాప్యానికి పీడీ బాధ్యత వహించి సకాలంలో స్టాక్ ఇచ్చి పేద పిల్లలకు పౌష్టికహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 13 మంది కార్యకర్తలకు పెండింగ్ హానరోరియం చెలించడం లో జరుగుతున్న జాప్యంపై మండిపడ్డారు. శనివారంలోగా పెండింగ్ బిల్లులు జీతాలు విడుదల చేసి అంగన్వాడీలకు బాసటగా నిలవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుమలత, విజయమ్మ, సురేఖ భూదేవి, శంకరమ్మ, పద్మజ, షబాన, కళావతి, పీరమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

జిఎస్‌టి తగ్గింపును రైతులు వినియోగించుకోవాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ట్రాక్టర్లు, వ్యవసాయ, అనుబంధ రంగాల పనిముట్లపై జిఎస్‌టి తగ్గింపును రైతులందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాయచోటిలోని మార్కెట్ యార్డులో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం రంగాలకు సంబంధించిన ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, బయో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్లు, తదితర వస్తువులపై జిఎస్‌టి 2.0 అమలు అనంతరం రైతులకు చేకూరే లబ్ధిపై ప్రజలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిఎస్‌టి 2.0 ద్వారా అన్ని వర్గాల ప్రజలకు చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించేందుకు సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా పేర్కొన్నారు. ఒక దేశం ఒక పన్ను అనే సిద్ధాంతంతో రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 2017లో జిఎస్‌టిని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తరువాత అతిపెద్ద ఆర్థిక సంస్కరణ జిఎస్‌టి 2.0 అని, దీని ద్వారా 99 శాతం వస్తువులకు ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. తగ్గింపు వల్ల ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. గతంలో 18 లేదా 12 శాతం జిఎస్‌టి ఉన్న వస్తువులకు 5 శాతం లేదా 0 శాతం జిఎస్ఐ అమలవుతుందని పేర్కొన్నారు. తగ్గిన జిఎస్‌టి రేట్ల ద్వారా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంవత్సరానికి రూ.8000 కోట్ల ఆదాయం తగ్గుతుందని, అయితే ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఎట్టుకొని ఈ సంస్కరణకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కోల్పోతున్న ఈ ఆదాయం ప్రజల చేతుల్లో మిగిలి వారందరికీ లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. ఈ వారం వ్యవసాయ పరికరాలు ఉద్యాన పంటలకు ఉపయోగించుకునే పరికరాలు, ట్రాక్టర్లు, వంటి వస్తువులపై రైతులకు ఏ విధంగా లబ్ధి చేకూరుతుందో తెలియజేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం జిఎస్‌టి రేట్లు తగ్గించిందని తెలిపారు. తగ్గిన రేట్లను ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అనంపల్లి రాంప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళా రైతుకు లబ్ధి చేకూరే పత్రం అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

గోకులానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ శ్రీధర్

గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అరుంధతివాడలో సోమవారం ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.1.80 లక్షల వ్యయంతో లబ్ధిదారుడు నగిరిపాటి చంగయ్యకు నాలుగు పశువుల సంరక్షించుట కొరకు గోకులం షెడ్డును ప్రభుత్వం మంజూరు చేసిందని ఎపిఒ మృత్యుంజయరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. పశువుల సంరక్షణ కొరకు నగిరిపాటి చెంగయ్య అభ్యర్థన మేరకు గోకులం షెడ్డును ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. ప్రజల కష్ట, నష్టాలను తెలుసుకొని వారికి ఎటువంటి సంక్షేమ పథకాలు కావాలో వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజల పక్షాన నిలబడే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ షెడ్డు నిర్మించడం ద్వారా పశువులు, ఎండ్లకు వర్షానికి సంరక్షించడానికి దోహదపడుతుందని చెప్పారు. రానున్న వర్షాకాలంలో పశువులు బయటికి వెళ్లి మేత మేయడానికి వీలుకాని పక్షంలో దానాను నిలువ ఉంచుకోవడానికి వీలుగా ఈ షెడ్డు కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఎంపిడిఒ వి. నాగిరెడ్డి అధ్యక్షత వహించగా, ఎపిఒ మృత్యుంజయరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఇసి శివ శంకర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు కుమార్, శ్రీహరి, ప్రకాష్, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెంకటరెడ్డిపల్లి అరుంధతివాడ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి తెలుగు పండితుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పీలేరు

తెలుగు పండితుల సమస్యల పరిష్కారానికి కృషిచేసిన ఎమ్మెల్సీకి సిపిఎస్ నాయకులు, పండితులు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో పదేళ్లుగా ఉద్యోగోన్నతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్న తెలుగు పండితుల సమస్యను ఎన్‌డిఎ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తగు న్యాయం చేకూర్చిన పట్టభద్రుల శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్‌ను సోమవారం మదనపల్లిలో కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్లు ఎపి సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. గత ప్రభుత్వంలో తాము ఆర్థికంగా చాలా నష్టపోయామని కనీసం ఎన్‌డిఎ ప్రభుత్వమైనా ఈ దీపావళికి రెండు డిఎలను ప్రకటించి ఆదుకోవాలని వారు కోరారు. పిఆర్‌సి కమిటీని నియమించాలని, కమిటీ నివేదిక వచ్చేలోపు తమకు మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. అ సిపిఎస్ విధానం రద్దు పట్ల తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సూపర్ సిక్స్ మాధిరిగానే ఉద్యోగులకూ అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎస్ నాయకులు ములవగిలి సుబ్రమణ్యం, వసంత కుమార్ పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో, నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యనూ. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని చెప్పారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీ దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - రాయచోటి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ సోమవారం తన విధుల్లో ఉండగా ఒకరు దాడి చేయడం దారుణమని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) అన్నమయ్య కడప ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ బాధ్యతలు చేపట్టిన రోజునే 'భారత రాజ్యాంగమే సుప్రీం' అని ప్రకటించారని, ఆ రోజు నుండి మత చాందసవాదులు ఈ మాటలు భరించలేక ప్రధాన న్యాయమూర్తిపై కన్నేసి ఉంచారని చెప్పారు. న్యాయవ్యవస్థ తాము చెప్పినట్లే నడుచుకోవాలని, రాజ్యాంగం చెప్పినట్టు కాదని ఆలోచిస్తున్నా వారి కుట్రలో భాగమే ప్రధాన న్యాయమూర్తి పై ఈ దాడికి ప్రయత్నంచోటు చేసుకుందని చెప్పారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరమని వారన్నారు. ఇది జస్టిస్ గవాయి పై దాడి ప్రజాస్వామ్య మనుగడకు ప్రధానమైన వెన్నెముకగా ఉన్న న్యాయవ్యవస్థ పై దాడిగానే చూడాలని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి దాడులను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఎల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాదులు

అవార్డు అందుకుంటున్న వశిష్ట స్కూల్ కరస్పాండెంట్ కె.రెడ్డి రాజు

కొండూరు రెడ్డయ్య రాజుకు విశిష్ట సేవా పురస్కారం

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రయివేట్ పాఠశాలల తరుపున వశిష్ట, చైతన్య పాఠశాలల కరస్పాండెంట్ డాక్టర్ కొండూరు రెడ్డయ్య రాజుకు విశిష్ట సేవా పురస్కారం లభించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజమండ్రి ఎడ్యుకేషన్ స్పెషల్ విద్యారంగ పత్రిక గోదావరి టాలెంట్ టెస్ట్ వారు నిర్వహించిన ఆదర్శ గురువుల సత్కార సమారోహ అనే కార్యక్రమంలో ఆయన అవార్డును సినిమాట్రోగఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన్ను పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీ పురంధరేశ్వరిదేవి, విద్యావేత్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను వివరించారు. రాజమహేంద్రవరంలో గోదావరి తల్లి ఆశీర్వాదం వల్ల ఈ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ అవార్డును పాఠశాల స్థాపకులు కీర్తిశేషులు, తన తండ్రి కొండూరు పెద్దరామరాజు, తల్లి సుబ్బమ్మకు అంకితమిస్తున్నానని చెప్పారు. అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - సుండుపల్లి: రహదారులకు మరమ్మతులు చేయాలని జనసేన రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు రామశ్రీనివాస్ పేర్కొన్నారు. సోవారం ఆయన కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల వేదికలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ శ్రీనివాస్ మాట్లాడుతూ రాయచోటి నుంచి టి. సుండుపల్లి మీదుగా రాయవరం, పింఛా వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా కోతలకు గురై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రాయచోటి వయా రాజంపేట రెండు వరుసల రహదారి పనులు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని చెప్పారు. టి.సుండుపల్లి మండలంలోని అగ్రహారం నుంచి సామిసేని గడ్డ వరకు సుమారు 9 పల్లెలకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి వాహనదారులకేగాక, బాటసారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యలన్ని పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్‌రెడ్డి, సంబంధిత శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారునప. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కల్తీ మద్యం కేసును సిబిఐకి అప్పజెప్పాలి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసును వెంటనే సిబిఐకి అప్పజెప్పాలని వైసిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీ దందా ఏడాది కాలంగా కొనసాగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించు కోకపోవడం దుర్మార్గమన్నారు. రూ.400 కోట్ల పైబడి విలువ గల మద్యం స్కామ్ వెనుకగల సూత్రధారులను వెలికితీయాలన్నారు. అధికార పార్టీకి చెందిన బడా నేత సహాయ సహకారాలు లేనిదే ఇంత పెద్ద స్కామ్ జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. స్కాం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జనార్ధన్ వెనుక ఇంకాఎవరున్నారన్న అంశంపై ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించి వాస్తవాలు వెల్లడించాలన్నారు. సంపద సృష్టిస్తా.. అంటున్న చంద్రబాబు సృష్టించిన సంపదే నకిలీ మద్యం తయారీ అంటూ ఆయన మండిపడ్డారు. సమావేశంలో జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షులు చంద్రనాయక్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు అశోక్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ 'పోలా'కు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట: మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డిని వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమించినందుకు గానూ సోమవారం వైసిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి జాహిద్‌అలీ ఆధ్వర్యంలో కాకతీయ పాఠశాలలో పోలా శ్రీనివాసులురెడ్డిని కలిసి ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునాఫ్, మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా మొహిద్దీన్, పట్టణ అధ్యక్షులు మసూద్ అలీ ఖాన్, సత్తార్, అక్తర్, నాసిర్, యాసీన్, అంజాద్, అలీ, ఖాదర్ బాషా పాల్గొన్నారు.



పోలాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అట్టహాసంగా పికెఎం చైర్మన్ ప్రమాణ స్వీకారం

- హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, టిడిపి ప్రముఖులు

ఉడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సురేష్ బాబు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

పికెఎం (పలమనేరు, కుప్పం, మదనపల్లి) అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా డాక్టర్ బి.అర్.సురేష్ బాబు ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం మదనపల్లి పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యా లయంలో ఉన్న పికెఎం ఉడా కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మదనపల్లి, చిత్తూరు, గన్నవరం, నగరి ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా, గురజాల జగన్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, భానుప్రకాష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉడా అధికారులు సురేష్ బాబు చేత ప్రమాణం చేయించారు. హాజరైన ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, మంచి, మర్యాదలు, రాజకీయ విలువలు తెలిసిన వ్యక్తిగా సురేష్ బాబు గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, నారా భువనేశ్వరి చైర్మన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. విద్యావంతుడైన బి.ఆర్ సురేష్ బాబు ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా 10వ ర్యాంకు సాధించారని, తరువాత డాక్టర్ వృత్తిలో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తూ గుర్తింపు పొందారని చెప్పారు. తండ్రి బి.ఆర్ దొరస్వామి నాయుడు 1978లో కుప్పం ఎమ్మెల్యేగా గెలిచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. రెస్కో చైర్మన్, సమితి ప్రెసిడెంటుగా కుప్పం ప్రజలకు సేవ చేశారన్నారు. అలాంటి నాయకుడి కుమారుడు బిఆర్ సురేష్ బాబు కుప్పం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. బిఆర్‌డి సేవా సంస్థ ద్వారా గత అనేక ఏళ్లుగా కుప్పం ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కుప్పం నియోజకవర్గంతోపాటు పలమనేరు, పుంగనూరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2019లో ఇదే బి.ఆర్ సురేష్ బాబు కుప్పం నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపైనే ఎమ్మెల్యేగా పోటీ చేసినా, ఇప్పుడు ఆయన టీంలోనే పనిచేసే అవకాశం కల్పించారని చెప్పారు. పికెఎం ఉడా చైర్మన్ బి.ఆర్.సురేష్ బాబు మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల సమక్షంలో తాను ప్రమాణస్వీకారం చేయడం సంతోషంగా ఉంద న్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నియమ నిబంధనలు పాటించి ఉడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉడా ఎపిఒ కె.ఆర్.మధు, పి.ఒ.సంధ్య, డిఇ మహేష్, టిడిపి సీనియర్ నాయకులు రాటకొండ బాబురెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎపిఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి నాయకులు ఆర్.జె. వెంకటేష్, సీడ్స్ మల్లికార్జున నాయుడు, ఎస్.ఎ. మస్తాన్, రాటకొండ మధు బాబు, రాటకొండ హర్ష, ఆర్.కె రామకృష్ణ ఆచారి, పెరవలి నవీన్, రాటకొండ రాజేష్, కంచర్ల శ్రీనివాసులు నాయుడు, నిరంజన్ నాని, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రథమ లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామాల అభివృద్ధిని ప్రథమ లక్ష్యంగా చేసుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పనిచేయాలని ఎంపిపి డి.నరసింహులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పనిచేయాలని సూచించారు. మండలంలోని సుమారు 15 శాఖలకు సంబంధించిన అధికారులతో గడిచిన మూడు నెలలో చేసిన అభివృద్ధి, అభివృద్ధికి వెచ్చించిన నిధులపై సమీక్షించారు. పారిశుధ్యం, తాగునీరు, వైద్యం వంటి వాటికి అధిక ప్రాధాన్యతను కల్పించాలన్నారు. ఎంపిడిఒ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి ఇంటి వద్ద పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని పేర్కొన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి బ్లీచింగ్ పిచికారి చేయాలని తెలిపారు. జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిఎస్‌టి తగ్గింపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఈ పోటీలను నిర్వహించాలని విద్యా శాఖాధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి కిట్లను అందిస్తున్నారని ఎంఇఒ పద్మావతి పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులను సమకూరుస్తున్నామని తెలిపారు. మండలంలోని రైతులు సాగు చేసిన ప్రతి పంటను వ్యవసాయ సహాయకుల చేత అక్టోబర్ 31వ తేదీలోపు తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఎఒ మంజుల అన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకపోతే ప్రభుత్వ పరంగా ఏమైనా ప్రోత్సహకాలు కానీ, అకాల వర్షాలతో నష్టాలు జరిగినప్పుడు పరిహారం వచ్చేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పశువులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులు ఏర్పడడంతో, మద్యం ఏరులై పారుతోందని బెల్టు షాపులను నియంత్రించాలన్నారు. నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురానికి రాకపోకలు కొనసాగించడానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ మార్గంలో ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని ఎంపిడిఒ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, రీసర్వే డిటి సిరాజుద్దీన్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

ఇఒను సత్కరిస్తున్న ఎంసి చైర్మన్ పురం రామమూర్తి

బాధ్యతలు స్వీకరించిన ఇఒ బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు: పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒగా బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కోటపల్లిలో మురుగు కాలువ సమస్యను ఇఒ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఇఒ తక్షణమే జెసిబితో క్షేత్రస్థాయికి చేరుకున్నారు. వర్షాల కారణంగా అక్కడ మురుగు నీటి కాలువ పూడిపోయి, మురుగునీరు రోడ్డుపై పొర్లుతుండడం ఈవో గుర్తించారు. జెసిబి సాయంతో కాలువ పూడిక తీయించి, చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగిం పుకు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దానికి ముందు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇఒను ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్షులు బివి రమణ, నాయకులు ఆర్.ఓబులయ్య, బి.నాగార్జున, ఎల్లప్ప, రాజేశ్వరి, శాంతకుమారి, కార్మికులు ఇఒ బ్రహ్మానంద రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.

మల్లయ్యకొండకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి: మల్లయ్య కొండకు సోమవారం యాత్రికులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించు కున్నారు. అర్చకులు ఉదయమే స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. యాత్రికులు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. యాత్రికులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. కొండపై యాత్రికులకు అన్నదానం చేశారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మ అమ్మవారికి పూజారి శేఖర్ విజయనిర్మల ప్రత్యేక అలంకరణ చేశారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు కల్తీ మద్యం తయారీ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నియోజవర్గం ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రరెడ్డిపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేయడంతో టిడిపి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ వర్గీయులు బి.కొత్తకోటలో సంబరాలు చేసుకున్నారు. సోమవారం పట్టణంలోని జ్యోతి చౌక్ వద్ద బాణాసంచాలు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. సాధారణంగా ఎక్కడైనా ప్రతిపక్ష నాయకులపై వేటుపడిన, కేసులు నమోదైన సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. నియోజకవర్గంలో 2024లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన దాసిరిపల్లె జయచంద్రారెడ్డి అనంతరం ఇన్‌ఛార్జిగా కొనసాగుతూ సొంత పార్టీ నేతలను నానా ఇబ్బందులకు గురిచేశారని అధిష్టానం వద్ద వాపోయారు. ఆ పార్టీ నేతలు గత కొన్నాళ్లుగా వైసిపి నాయకులకు జయచంద్రారెడ్డి అండగా నిలుస్తున్నారని, గత కొన్నాళ్లుగా టిడిపి సీనియర్ నాయకులు, జి.శంకర్ యాదవ్ వర్గీయులు గళం విప్పుతున్నారు. కార్యకర్తలను పట్టించుకోకుండా వైసిపిలో నుంచి వచ్చిన కొందరికే బి.కొత్తకోట మండల బాధ్యతలు ఇచ్చి టిడిపి సీనియర్ నాయకులకు అన్యాయం చేస్తున్నాడని వాదిస్తూ వచ్చారు. అక్రమ మద్యం స్కాంలో ఆరోపణలు ఎదుర్కొని పార్టీకి చెడ్డపేరు తెచ్చిన నేపథ్యంలో టిడిపి అధిష్టానం సస్పెండ్ చేయడంతో సంబరాలు జరుపుకున్నట్లు తెలుగు తమ్ముళ్లు తెలిపారు. కొత్త ఇన్‌ఛార్జి రాకతో తంబళ్లపల్లిలో టిడిపి పూర్వవైభవంగా సంతరించుకుంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

రాజకీయ నాయకులకు సంబంధం లేదు

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో దొరికిన నకిలీ మద్యం వ్యవహారం మొత్తం నాదేనని ఇందులో తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఏ రాజకీయ నాయకునికి సంబంధం లేదని నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న జనార్ధన్ రావు విదేశాల నుండి సోమవారం రాత్రి విలేకరులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం విషయంలో కొందరు గిట్టని రాజకీయ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఇందులో ఏ రాజకీయ నాయకునికి సంబంధం లేదని ఉద్దేశపూర్వకంగా కొందరు నాయకులను ఇబ్బంది పెట్టడానికి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఇందులో వారికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. నేను అనారోగ్య కారణంగా విదేశాలకు వచ్చానని ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఇండియాకు వచ్చి ఇందులో జరుగుతున్న కుట్రలు అన్నింటిని పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు తెలియజేసి ఈ కేసులో పూర్తిస్థాయిలో సహకరిస్తానని వివరణ ఇచ్చారు.

ప్రజలందరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

- స్వచ్ఛాంధ్ర పురస్కార కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రాయచోటి రూరల్

స్వచ్ఛ అన్నమయ్య జిల్లా నిర్మాణంలో భాగస్వామ్యమైన స్వచ్ఛ సైనికులు అందరికీ ధన్యవాదాలు తెలిపి, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని స్వచ్ఛతపై అవగాహన ప్రతి ఇంటి నుండి ప్రారంభం కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2014 నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండవ తేదీన స్వచ్ఛభారత్ దివస్‌గా జరుపుకుంటున్నా మని స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు గాంధీ మహాత్ముడు పుట్టినరోజును జరుపుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 17 నుండి భారత దేశ స్థాయిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి అక్టో బర్ రెండో తారీఖున పూర్తి చేశారన్నారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జనవరి నెల నుండి ప్రతినెల మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపు కుంటున్నామని ఒక్కో నెల ఒక్కో ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిం చామ న్నారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం జరుగుతుందని ప్లాస్టిక్ పై అవగాహన కలిగి ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందన్నారు. గత సెప్టెంబర్ నెలలో గ్రీన్ ఎపి అనే ఇతివృత్తంతో మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిం చామన్నారు. స్వచ్ఛ అన్నమయ్య జిల్లా నిర్మాణంలో కృషిచేసిన స్వచ్ఛ

అవార్డు అందుకుంటున్న మాసాపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి

అవార్డు అందుకుంటున్న పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

సైనికులు ఎన్జీవోలు హాస్టళ్లు మున్సిపాలిటీలు తదితర 17 క్యాటగిలలో అవార్డుల ప్రధానోత్సవం నేడు చేసుకుంటున్నామన్నారు. స్వచ్ఛతను ఒకరోజు కార్యక్రమం కాకుండా జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అది ప్రతి ఇంటిలో ప్రారంభం అవ్వాలని చిన్నపిల్లలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి స్వచ్ఛత పరిశుభ్రతను వారి జీవితాల్లో భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక ప్లాస్టిక్ బాటిల్ భూమిలో కలిసిపోవాలంటే 200 సంవత్సరాలు పడుతుందని ఆ విధంగా జరగకుండా ఉండాలంటే వ్యర్థ పదార్థాల సేకరణ, ప్రాసెసింగ్ సాంకేతికంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. రోడ్లమీద పార్కులలో ఖాళీ ప్రదేశాలలో చెత్తను వేయరాదని ప్రజలందరికీ సూచించారు. ఈరోజు అవార్డులు తీసుకున్న ప్రతి ఒక్కరు ప్రజలందరికీ స్వచ్ఛతపై అవగాహనను కల్పించి స్వచ్ఛ అన్నమయ్య జిల్లా స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో భాగస్వామ్యం కావాలన్నారు. టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పరిశుభ్రతను పెంచేలా చర్యలు తీసుకున్న వారందరినీ గుర్తించేందుకు అవార్డుల కార్యక్రమం ఏర్పాటుచేసిన నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛతను ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం అనంతరం రాష్ట్ర స్థాయి అవార్డుల కార్యక్రమం జరుగుతుండగా కలెక్టర్ నిశాంత్ కుమార్, టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు గ్రహీతలకు అవార్డులు అందించారు. అంతకుముునుపు పలువురు అవార్డు గ్రహీతలు వారి వారి అభిప్రాయాలను హాజరైన ప్రజలతో పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

- 'యురేనియం' బాధితుల వెల్లడి
- టెయిలింగ్ పాండ్ వద్ద కెకె కొట్టాల గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని స్థానిక తుమ్మలపల్లి వద్ద యురేనియం కర్మాగారం నుంచి వెలువడే రసాయన వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసి పైపు గొట్టాల ద్వారా కెకె కొట్టాల సమీపంలోని టెయిలింగ్ పాండ్‌లో నిల్వ చేసేవారు. దీనివల్ల కలుగుతున్న ఇబ్బందుల నుంచి తమకు న్యాయమైనా చేయండి లేకపోతే చంపండి అంటూ కెకె కొట్టాల గ్రామస్తులు సోమవారం సాయంత్రం టెయిలింగ్ పాండ్ మెయిన్ గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ టెయిలింగ్ పాండ్ నిర్మించినప్పుడు నుంచి తమ గ్రామానికి కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. టెయిలింగ్ పాండ్‌ను నాసిరకంగా ఏర్పాటు చేయడంతో వ్యర్థాలన్నీ భూమిలోకి ఇంకుతున్నాయని, ఇలా ఇంకిపోవడం వల్ల తాగునీరు, చుట్టుపక్కల పొలాల సాగునీరు కలుషితమైందని పేర్కొన్నారు. టెయిలింగ్ పాండ్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వర్షాలు పడినప్పుడల్లా టెయిలింగ్‌పాండ్ పొంగి నీరంతా పొలాల్లోకి వస్తుందని తద్వారా పంట పొలాలు సాగుకు పనికి రాకుండా పోతున్నాయని పేర్కొన్నారు. యురేనియం, రెవెన్యూ అధికారులకు ఎన్ని మార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. టెయిలింగ్ పాండ్ నుంచి వెలువడే దుమ్ము ధూళితో శ్వాసకోశ, చర్మ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోయారు. ఇప్పటికే ఉన్న టెయిలింగ్ పాండ్ రెండుసార్లు ఎత్తు పెంచారని మరలా పెంచేందుకు యురేనియం అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారని మాకు న్యాయం జరిగేంత వరకు టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులను నిలిపివేయాలని తెగేసి చెప్పారు. ఒకవేళ

టెయిలింగ్‌పాండ్ మెయిన్‌గేటు వద్ద ఆందోళన చేస్తున్న కెకె కొట్టాల గ్రామస్తులు

టెయిలింగ్‌పాండు ఎత్తును పెంచడానికి ప్రయత్నించారో ఆత్మహత్య చేసుకోవడానికైనా వెనుకాడమని గ్రామస్తులు హెచ్చరించారు. మరోపక్క రెండో నూతన టెయిలింగ్ పాండ్ నిర్మాణం అంటూ వారం రోజులుగా సర్వే పేరుతో యురేనియం అధికారులు నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో నూతన టెయిలింగ్ పాండ్‌కు ఎన్ని ఎకరాలు తీసుకుంటున్నారు, ఎన్ని సర్వే నెంబర్లు, యజమానుల పేర్లు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత పనులు ప్రారంభించాలని చెప్పారు. అలాగే భూ నిర్వాసితులకు ఉద్యోగాలు పరిహారం పునరావసం కల్పించిన తర్వాతే నూతన టెయిలింగ్ పాండ్ ను కానీ ప్రస్తుతం ఉన్న టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచుకునేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. కానీ పై స్థాయి నుంచి ఒత్తిడి తెచ్చి ఇప్పుడు ఉన్న టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచేందుకు పోలీసుల సహాయంతో తమను అణిచివేయాలని చూస్తే తమ గ్రామానికి చావు తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉన్న ఓపిక, ఓర్పు ఇక ఉండవని, మమ్మల్ని భయపెట్టి టెయిలింగ్ పాండ్ ఎత్తు పనులను ప్రారంభిస్తే గ్రామస్తులం మూకుమ్మడిగా సామూహిక ఆత్మహత్యలు చేసుకుంటామని తెగేసి చెప్పారు.

భూ సమస్యలు పరిష్కరించకపోతే
ఉద్యమం తప్పదు : వ్య.కా.స

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని పేదలకు భూమి పంచకపోతే ఉద్యమం తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల పేద ప్రజలు మాకు నాయనపల్లె పొలంలో భూమి పంపిణీ చేయాలని, లేకపోతే చేయకపోతే ఉద్యమం చేస్తామని తహశీల్దార్ వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం సమర్పించారు అనంతరం అన్వేష్, సిపిఎం మండల కార్యదర్శి పోలయ్య మాట్లాడుతూ రెండు నెలల కిందట నాయన పల్లె పొలంలో సర్వేనెంబర్ 217.129 నెంబర్లలో ప్రభుత్వ భూమి పేదలకు పంపిణీ చేయాలని దాదాపు 400 దరఖాస్తులు ఇచ్చామన్నారు వాటిని ఇంతవరకు విచారణ చేపట్టడం కానీ, అర్హుల జాబితాను తయారు చేయడం కానీ ఏమాత్రం చర్య తీసుకోవడం లేదని తహశీల్దార్ నిర్లక్ష్యంగా ఉన్నారని, వెంటనే జాబితా తయారు చేసి సర్వేనెంబర్‌లోని భూమి పేదలకు పంచకపోతే వచ్చే సోమవారం నుండి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలే నిహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుబ్బారావు వరి కుంట్ల నాయన పల్లె ఆకుల నారాయణ పల్లె ఇటుకలపాడు కొండరాజుపల్లె, పేదలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి బోర్డు మెంబర్‌గా హైమావతి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యురాలుగా కడప నియోజకవర్గ, శంకరాపురానికి చెందిన మాజీ కార్పొరేటర్ పెనగలూరు హైమావతి నియమితుల య్యారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ట్రాన్స్ ఫార్మర్ శ్రీనివాసులు, ఆయన సతీమణి హైమావతి తెలుగు దేశం పార్టీ లో క్రియాశీలకంగా కొనసాగుతూ వస్తున్నారు. పార్టీ పట్ల అంకితభావం, పార్టీకి అందించిన సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం హైమావతికి కాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యురాలుగా అవకాశం కల్పించింది. ఆమెను నియామకం పట్ల అఖిల గాండ్ల, తేలికుల సంక్షేమ సంఘం తరపున పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

వికలాంగుల సమస్యలపై పోరాటం

- పోరాట సమితి అధ్యక్షులు గోవింద్ గణేష్

ప్రజాశక్తి-చెన్నూరు: రాయలసీమలోని వికలాంగుల సమస్యలపై దృష్టి పెట్టి పూర్తిస్థాయిలో వికలాంగుల సమస్యల మీద పోరాటం చేస్తానని రాయలసీమ వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గోవింద గణేష్ అన్నారు, రాష్ట్రంలో చాలామంది వికలాంగులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. అర్హులకు పింఛను, సదరం సర్టిఫికెట్ మంజూరులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. మరొకసారి రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల మీద దయ ఉంచి వారికి అర్హత పరీక్ష నిర్వహించలని కోరారు.

మద్యం కేసు సిబిఐతో విచారణ జరపాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తు దొరికిపోయిన కేసును సిబిఐకి అప్పగించి విచారణ జరిపించాలని వైసిపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డి తంబళ్లపల్లి నియోజకవర్గం వెనుకబడిందని పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తానన్నారు. అన్నమాట నిలబెట్టుకునేందుకు ఏకంగా సౌత్ ఆఫ్రికా నుండి నకిలీ మద్యం తయారీ పరిశ్రమను ములకలచెరువుకు తెచ్చిన ఘనత తప్పించుకున్నారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ స్వార్థంతో రాజకీయాలు చేయాలి అనుకుంటే పతనం తప్పదన్నారు. ఈ కేసులో మద్యం గోడౌన్ యజమానిని ఎక్సైజ్ వారు ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. మద్యం సరఫరా చేసే వాహన డ్రైవర్ రమణ ను ఎందుకు విచారణ చేసి అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అక్రమ మద్యం తయారు చేయడానికి లీజుకు తీసుకున్న లీజుదారుడు మంత్రి గిరిధర్‌రెడ్డి పేరు కేసులో ఉంచి అరెస్టు చేయకపోవడం ఏమిటన్నారు. జయచంద్ర రెడ్డి పి ఏ రాజేష్ ఈ అక్రమ మహత్యం తయారీ దానిలో లేకపోతే ఎందుకు పరారీలో ఉన్నాడన్నారు. అధికారంలోకి రాగానే కొందరు టిడిపి నాయకులు ఎమ్మెల్యేని నియోజకవర్గంలో తిరగనియ్యమంటూ నానా రవస రభస చేసి ఈ అక్రమ మార్గాలు ను నిర్వహించేందుకేనా అని టిడిపి శ్రేణులను ప్రశ్నించారు. 18 నెలల పాలనలో నియోజకవర్గంలో కనీసం పది కిలోమీటర్ల తారు రోడ్డు అయినా వేశారా ఇదేనా అభివృద్ధి నకిలీ మద్యం తయారుచేసి కోట్లకు కోట్లు దండుకొని పేదల రక్తాన్ని పీల్చడమేనా కూటమి ప్రభుత్వ పాలన అంటే అన్నారు. ఈమద్యం కేసును సిబిఐకి అప్ప చెప్పాలని షిఫ్టింగ్ జడ్జ్ ద్వారా విచారణ జరిపించాలని లేకుంటే ధర్నాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపిపి కరీం, కోటిరెడ్డి, రామ్మూర్తి, నారాయణరెడ్డి, కరీముల్లా, సర్పంచ్ రెడ్డి నారాయణ, మల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌జిఒ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : ఎన్‌జిఒ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని ఆ సంఘ జిల్లా ఉపా ధ్యక్షుడు సిద్దయ్య పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో సోమవారం నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షులు సిద్దయ్యకు ఎన్‌జిఒ సంఘ నాయ కులు, సభ్యులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లా, రాష్ట్ర అధ్యక్షులకు, ఎన్జీవో సంఘ నాయ కులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, సెక్రటరీ ప్రసాద్. సహాయ అధ్యక్షులు సుకుమార్, మాజీ అధ్యక్షులు గురుప్రసాద, సంఘ నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగిన వీధులను పరిశీలిస్తున్న అధికారులు

నీట మునిగిన వీధులు

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లెలోని ఆర్అండ్‌బి బంగ్లా వెనుక వైపు ఉన్న మీట మునిగిన వీధులను సోమ వారం అధికారులు పరిశీలించారు. ఎండిఓ రాధాకృష్ణ, పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాసులు, నాగిరెడ్డిపల్లె పంచాయతీ సెక్రెటరీ సురేష్ నీట మునిగిన వీధుల లోని బాధితులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యను పిలిపించి చెరువుకు నీటిని తరలించే కాలువలో ప్రవాహ వేగాన్ని తగ్గించాలని సూచించారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరిం చారు. ప్రజలకు సమస్య తలెత్త కుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇంత జరుగుతున్న ఇరిగేషన్ అధికారులు మాత్రం నీట మునిగిన సమస్యాత్మక ప్రాంతాలను చూడకపోవడం ఏమిటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

జిఎస్‌టితో ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి-కలికిరి

జిఎస్‌టితో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని పీలేరు నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మద్దిరాల మల్లికార్జున విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రచారం చేస్తున్న సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంతో ప్రజలకు ఒరిగింది శూన్యమన్నారు. నిత్యావసర వస్తువులపై ఇప్పటివరకు రూపాయి కూడా తగ్గలేదని తెలిపారు. ప్రచారం మాత్రం అంబరాన్ని అంటుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించాలే తప్ప రాజకీయ లబ్ధి కోసం, ప్రచార యావ కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించడం సబబా అని ప్రశ్నించాడు. గతంలో ఇదే కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి అమలు చేసి, ప్రతి వస్తువుపై పన్నులు విధించడంతో రైతుల, వ్యాపారులు నుండి సామాన్య ప్రజల వరకు భారంగా మారిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సామాన్యులను ప్రక్కన పెట్టి ధనవంతులకు లబ్ధి చేకూరేలా కార్లు, ఎసిలపై జిఎస్‌టి తగ్గించిందన్నారు. సామాన్యులు వినియోగించే నిత్యావసర వస్తువులపై చిన్న చూపుతో సామాన్యులను మోసం చేస్తున్నారన్నారు. ఒక ప్రక్క ఇప్పటికే తగ్గించిన ధరలు అమలు కాకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. నాయకులు సంబరాలు కాకుండా అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీవితాన్ని మట్టికి ధారపోసి, కష్టానీ కాలాన్ని త్యాగం మిచ్చి, తన కడుపు కోసం కాకుండా, అందరి కడుపు నింపే వాడే రైతని తెలిపారు. పేద రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయ పరికరాలుకు సంబంధించి జిఎస్‌టి కూడా తగ్గించాలని కోరారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర బైక్ దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగ అరెస్టు

- రూ.13.50 లక్షల విలువైన 25 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అంతర్రాష్ట్ర బైక్‌ల దొంగను సోమవారం మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు డిఎస్‌పి మహేంద్ర, సిఐ కళా వెంకటరమణ స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద నిందితున్ని అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, చంద్రమాకుల పల్లెకు చెందిన పులి వెంకటరెడ్డి మదన పల్లెతో పాటు కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా, తిరుపతి జిల్లా ప్రాంతాల్లో సుమారు 40 బైక్‌లు దొంగలించాడన్నారు. వీటిలో 25 స్వాధీనం చేసుకున్నామని, ఇంకా 20 వాహనాల వివరాలు తెలియాల్చి ఉందన్నారు. పొరుగు రాష్ట్రంలో చోరీ చేసిన వాహనాలను ఆంధ్రప్రదేశ్ అమ్మడం, ఎపిలో చోరీ చేసిన వాహనాలను పక్క రాష్ట్రంలో అమ్ముతూ సొమ్ము చేసుకునేవాడని తెలిపారు. బైకులు చోరీకి గురవ్వుతుండడంతో నిఘా పెట్టిన మదనపల్లె తాలూకా పోలీసులు బసినికొండలో వాహనాల తనిఖీలో ఉండగా ద్విచక్రవాహనంలో అటుగా వచ్చిన నిందితుడు వెంకటరెడ్డి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో పటుకున్నారని చెప్పారు.విచారణలో నిందితుడు నేరం ఒప్పుకోవడం దాచిపెట్టి 25 బైకులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని తెలిపారు. కేసు దర్యాప్తును కొనసాగించి చోరికి గురైన మరిన్ని వాహనాలను రికవరీ చేస్తామని డిఎస్‌పి తెలిపారు.

కారు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని ఎర్రబెల్లి చెందిన రఘునాథ్‌రెడ్డి(55) ద్విచక్ర వాహనంలో అంగళ్లకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని అంగళ్లు రింగ్ రోడ్డు వద్ద కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ దిలీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి ని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో పోలీసులు డ్రోన్ కెమెరాతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై డ్రోన్ కెమెరాలతో దాడులు నిర్వహించి నిందితులను అణచివేయాలని ఎస్‌పి ధీరజ్ కనుబిల్లి, మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర ఆదేశాలను ఇదివరకే జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని దిగువపల్లె వద్ద కొంతమంది కలసి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. పేకాట స్థావరంపై డ్రోన్ కెమెరాతో దాడులు జరిపి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,850 నగదు, ఏడు మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. కోడిపందాలు, పేకాట స్థావరాలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి వాటిపై పోలీసులు గట్టి నిఘాను ఉంచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లతో పోలీసులు

IN THE COURT OF HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION)- RAJAMPET
O.S.No. 38/2022

వై. శేషా రెడ్డి తండ్రి వై. నాగిరెడ్డి, వయస్సు 47 సం॥ వ్యాపారము, నివాసం కొత్తపల్లి (గ్రామం) మట్టి (పోస్ట్) వీరబల్లి మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

రాయ హనుమా రెడ్డి, తండ్రి బుజ్జి రెడ్డి, హిందూ, వయస్సు 43 సం॥, వ్యాపారము, నివాసం ఎర్రబెల్లి, రాజంపేట, టౌన్ అండ్ మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

నోటీసు

వాది ప్రతివాది అయిన నీ పైన ప్రో నోటు బాకీ వసూలు నిమిత్తం పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 22.10.2025వ తేదీన మీరు స్వయంగా గాని లేదా వకీల్ ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

//By Order of the Court//
పి .ఎం. శ్రీనివాసులు
బి. లక్ష్మీనారాయణ
అడ్వకేట్స్, రాజంపేట.

మహారాజశ్రీ గౌరవ మూడవ అదనపు జిల్లా జడ్జి రాజంపేట వారి కోర్టు నందు
E. A. NO:101/2025
ARC. NO:27/2012 in E.P. NO: 30/2023

M/S శ్రీరామ్ ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ rep by బ్రాంచ్ మేనేజర్ D.జమాలయ్య, S/o జమాలయ్య, వయస్సు 36 సం., R/at- D.NO:4/438-1,1st ఫ్లోర్,సాయి శబరి ప్లాజా, తిరుపతి బైపాస్ రోడ్డు, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా, ఏ.పి. ...DHr/పిటీషనర్

V/s

1.S. గౌస్ బాషా, S/o. ఖాదర్ హుస్సేన్, వయస్సు 47 సం., ముస్లిం, R/at-D.NO:273-3A, మహబూబ్‌నగర్ రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా, ఏ.పి. ...JDR. NO-2

నోటీసు

పై E.P.లో JDR నెం-2 పక్షముగా, ముఖ్యంగా ఆర్డర్ 21-rule 22 సీపీసీ నోటీసు

పైన తెలిపిన DHr కంపెనీ తనకు డిక్రీ ద్వారా రావలసిన E.P. మొత్తమును రాబట్టుకునేందుకుగాను ఆర్డర్ 21, రూల్ 22 డిపిసి కింద మీ యొక్క హాజరు కోరుతూ E.P. దాఖలు చేసియున్నారు. పై E.P. మీ హాజరు నిమిత్తం 16.10.2025 వ తేదీన వాయిదా ఉన్నది. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//By order of the court//
నాగేశ్వర్. వి.చౌదరి,
DHr.అడ్వకేట్.

మహారాజశ్రీ గౌరవ మూడవ అదనపు జిల్లా జడ్జి రాజంపేట వారి కోర్టు నందు
E. A. NO:100/2025
ARC. NO:33/2019 in E.P. NO: 18/2023

M/S శ్రీరామ్ ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ rep by బ్రాంచ్ మేనేజర్ D.జమాలయ్య, S/o జమాలయ్య, వయస్సు 36 సం., R/at- D.NO:4/438-1,1st ఫ్లోర్,సాయి శబరి ప్లాజా, తిరుపతి బైపాస్ రోడ్డు, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా, ఏ.పి. ...DHr/పిటీషనర్

V/s

1. కే. మహేంద్ర నాయుడు, S/o ముని స్వామి, వయస్సు 45 సం., హిందూ, R/at. D.No: 5/71, భువనగిరి పల్లి గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా, ఏ.పి.
2. మాడపూరి యువరాజు S/o.చంద్రశేఖర్, వయస్సు 36 సం., హిందూ, R/at. D.No:14/16-1, ఇసుకపల్లి (V), హరిజనవాడ, నాగిరెడ్డి పల్లి (Po), నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్.

...JDR. No:1&2

నోటీసు

పై E.P.లో JDR నెం-1మరియు 2 పక్షముగా, ముఖ్యంగా ఆర్డర్ 21-rule 22 సీపీసీ నోటీసు

పైన తెలిపిన DHr కంపెనీ తనకు డిక్రీ ద్వారా రావలసిన E.P. మొత్తమును రాబట్టుకునేందుకుగానూ పై కోర్టు నందు E.P. దాఖలు చేసియున్నారు. పై తెలిపిన E.P. నందు మీ హాజరు నిమిత్తం ఆర్డర్ 21 రూల్ 22 క్రింద నోటీసు జారీ చేసియున్నారు. కావున పై E.P. నందు 16.10.2025 వ తేదీన వాయిదా ఉన్నది. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు గానీ, మీ వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//By order of the court//
నాగేశ్వర్. వి.చౌదరి,
DHr.అడ్వకేట్.

మహారాజశ్రీ గౌరవ మూడవ అదనపు జిల్లా జడ్జి రాజంపేట వారి కోర్టు నందు
E. A. NO :99/2025.
ARC.NO:471/2014 in E.P. NO:33/2023

M/S శ్రీరామ్ ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ rep by బ్రాంచ్ మేనేజర్ D.జమాలయ్య, S/o జమాలయ్య, వయస్సు 36 సం., R/at- D.NO:4/438-1,1st ఫ్లోర్,సాయి శబరి ప్లాజా, తిరుపతి బైపాస్ రోడ్డు, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా, ఏ.పి. ...DHr/పిటీషనర్

V/s

S. వరదయ్య, S/o. వెంకటసుబ్బయ్య, వయస్సు 43 సం., హిందూ, R/at. D.No:1-89, గొబ్బూరి వారి పల్లి (V), ఓబులవారిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా, ఆం.ప్ర. ...JDR. NO-2

నోటీసు

పై E.P.లో JDR నెం-2 పక్షముగా, ముఖ్యంగా ఆర్డర్ 21-rule 37 సీపీసీ నోటీసు

పై తెలిపిన DHr కంపెనీ తనకు డిక్రీ ద్వారా రావలసిన E.P. మొత్తమును రాబట్టుకునేందుకుగాను ఆర్డర్ 21 రూల్ 37 పి.పి.సి క్రింద నీయొక్క మిమ్ములను అరెస్టు చేసి సివిల్ ప్రిజన్ కు పంపమని పై E.P. దాఖలు చేసియున్నారు. పై E.P. నందు మీయొక్క హాజరుకు గానూ 16.10.2025 వ తేదీన వాయిదా ఉన్నది. కావున పై తెలిపిన తేదీకి ఉదయం 10:30 గంటలకు మీరు నేరుగా గాని, వకీలు ద్వారా గాని రాజశ్రీ వారి కోర్టు నందు హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//By order of the court//
నాగేశ్వర్. వి.చౌదరి,
DHr.అడ్వకేట్.